## క్లుప్తంగా

### పారిశుధ్య పనుల్లో అలసత్వం వహించొద్దు



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

**తాండూర్:** పారిశుధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కిష్టంపేట, కాసిపేట, బోయపల్లి గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య పనులు చేపట్టి చెత్తను కంపోస్ట్ షెడ్‌కు తరలించాలన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పనులు నిర్వహించాలని సూచించారు. నర్సరీ, వైకుంటధామం, కంపోస్ట్ షెడ్‌ల నిర్వాహణ సరిగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు చంద్రమౌళి, సాయితేజ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడు మృతి



సారయ్య(ఫైల్)

**శ్రీరాంపూర్:** నస్పూర్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మిట్టపల్లి సారయ్య(48) అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. నస్పూర్‌లో ఆదివారం వారి ఇంటి వద్ద మృతదేహాన్ని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కౌన్సిలర్ వంగ తిరుపతి, మున్సిపల్ సిబ్బంది, తోటి కార్మికులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### 'ఎమ్మెల్యే అండదండలతోనే అక్రమ వెంచర్'



మాట్లాడుతున్న భవాని

**జైపూర్:** మండలంలోని ఇందారంలో ఎమ్మెల్యే బాల్కసుమన్ అండదండలతో తన అనుచరులు కొత్త అక్రమ వెంచర్ ఏర్పాటు చేసి, పేదల భూములు లాక్కుంటున్నారని బీఎస్పీ జోనల్ మహిళా కన్వీనర్ మద్దెల భవాని ఆరోపించారు. జైపూర్ మండలం ఇందారం 146–ఈ లో అగ్రవర్ణ పేదలైన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వారసత్వ భూమిని కలుపుకుని, నూతనంగా వెంచర్ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. స్థానికంగా ఆమె విలేకరులతో ఆదివారం మాట్లాడారు. కొంత మంది దొరలు, నాయకులు కలిసి అగ్రవర్ణ పేదలకు చెందిన భూమిని కలుపుకొని వెంచర్ ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. వెంచర్ ఏర్పాటులో చాలా లొసుగులు ఉన్నాయని ప్రజలు గమనించాలన్నారు. బీఎస్పీ పార్టీ ప్రజలందరికీ అండగా ఉంటుందని, అగ్రవర్ణాలకు చెందిన 26గుంటల భూమిని ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ఆమె తెలిపారు.

### 'ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం'



వృద్ధుడితో మాట్లాడుతున్న చంద్రశేఖర్

**బెల్లంపల్లిరూరల్:** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ అన్నారు. సీపీఐ చేపడుతున్న ఇంటింటికీ సీపీఐ పాదయాత్ర ఆదివారం బెల్లంపల్లి మున్సిపాలిటీ 10వ వార్డు పెద్దనపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, నిరంకుశ పాలనను సాగిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో అనేక సమస్యలు నెలకొన్నా, వాటిని పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి పాలన సాగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బొల్లం పూర్ణిమ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కెమెరాల కన్నుగప్పి..!

- ఈ–చలాన్లు తప్పించుకునేందుకు అడ్డగోలు ప్రయత్నాలు
- తప్పుడు పద్ధతులు అనుసరించొద్దని పోలీసుల హెచ్చరిక

**దండేపల్లి:** ఈ–చలాన్‌ల నుంచి తప్పించుకునేందుకు కొందరు వాహనాదారులు తప్పుడు పద్ధతులు అనుసరిస్తున్నారు. ఫేక్ నంబర్లు పెట్టుకోవడం, ఒరిజినల్ నంబర్లకు చిన్నచిన్న మార్పులు చేసి, పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు తీసే కెమెరాలకు చిక్కకుండా ప్రయత్నిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

కొంతమంది వాహనదారులు మోటారు వాహన చట్టం నిబంధనలకు విరుద్ధంగా వివిధ డిజైన్‌లతో వాహనాలకు నంబర్‌ప్లేట్ అమర్చుతున్నారు. మరికొంత మంది వాహనాల నంబర్లు కనిపించకుండా ఉండేందుకు, స్టిక్కర్లు అంటించడం, మాస్కులు తగిలించడం, మరి కొందరైతే అసలు నంబర్ ప్లేట్ లేకుండానే తిరుగుతున్నారు. కొందరు తప్పుడు నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పోలీసుల తనిఖీలను దృష్టిలో పెట్టుకుని, అప్పటికప్పుడు చాకచక్యంగా వ్యవహరించి, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం వెనుక కూర్చున్న మహిళల చీరలు, చున్నీలు నంబర్‌కు అడ్డంగా వేసి కనిపించకుండా చేయడం, కొందరు కాళ్లను నంబర్ ప్లేట్‌కు ఆనించి కనిపించకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసుల తనిఖీల్లో స్పష్టమవుతోంది.



బైక్‌నంబర్ కనిపించకుండా ప్రయత్నిస్తున్న యువతి



నంబర్ కనిపించకుండా కాళ్లు అడ్డు పెడుతూ..



ఒక నంబర్ తొలగించి...

**కేసులు నమోదు చేస్తాం..**

వాహనదారులు తమ వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో తప్పుడు పద్ధతులు అనుసరిస్తే కేసులు నమోదు చేస్తాం. ఫేక్‌నంబర్లతో తిరిగే వారిని తనిఖీల్లో గుర్తించి చర్యలు తీసుకుంటాం. వాహనదారులు వాహన నంబర్ల విషయంలో జాగ్రత్తగా మెదులుకోవాలి. వాహన నంబర్‌లో ఎలాంటి మార్పులు చేయొద్దు. అలాచేస్తే తనిఖీల్లో ఈజీగా దొరికిపోతారు.

\- కుందారపు ప్రసాద్, ఎస్సై దండేపల్లి

## ఆర్అండ్ఆర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

**శ్రీరాంపూర్:** నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారా లేదా అని తెలుసుకున్నారు. అర్హులైన వారందరూ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మరోసారి కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి గెలిపిస్తే, మరింత అభివృద్ధి పొందవచ్చన్నారు. కాలనీవాసులు డ్రెయినేజీ, వీధి దీపాలు కూడా సరిగ్గా లేవని, ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిపై సింగరేణి యాజమాన్యంతో గాని, మున్సిపల్ అధికారులతో గాని చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, పార్టీ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు వంగ తిరుపతి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు సంతోశ్‌చారి, ఐత శంకర్, పీ.కమలాకర్‌రావు, గట్టు శ్రీనివాస్, పెద్దపల్లి రామన్న, శెట్టి రమణ, రుకుం తిరుమల్, బండారి తిరుపతి, కొండ్ర పోశయ్య, వంగపల్లి రజిత, కొండ్ర రాధ పాల్గొన్నారు.

## ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

**మంచిర్యాలక్రైం:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ అన్నారు. స్థానిక పట్టణంలోని న్యూ నాగర్జున కాలనీలో డాక్టర్ కేర్ హోమియోపతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు మల్లేష్, ఆసుపత్రి మేనేజర్ రజిత, ఆరోగ్యం సంరక్షణపై అవగాహన కల్పించారు. హోమియోపతి వైద్యం ఎంతో విలువైందని, దీని ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద ఇంకోటి లేదన్నారు. అనంతరం ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటస్వామి, బుర్ర రవి, నరేష్, చారి, వంశీ, మొగిలి, దేవన్న, రమేష్, మల్లిఖార్జున్, అశోక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులపై కేసు నమోదు చేయాలి

**వేమనపల్లి:** బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై అసత్య ఆరోపణలు చేస్తున్న ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఆదినారాయణరెడ్డి, సేజల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఎదుగుదలను చూసి ఓర్వలేక ఆరిజిన్ డైరీ నిర్వాహకులు కొంతమంది స్వార్థపరులు ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నేతకాని సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు జాడి గోపాల్, సక్కుబాయి, కొండగొర్ల బాపు తదితరులు పాల్గొన్నారు.

**చర్యలు తీసుకోవాలి**

**దండేపల్లి/తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై అసత్య ఆరోపణలు చేయడంతో పాటు, వ్యక్తిగతంగా దూషిస్తున్న ఆదినారాయణరెడ్డిపై, ఆరిజన్ డెయిరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నేతకాని మహార్ సంక్షేమ సంఘం దండేపల్లి మండల కమిటీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దండేపల్లి, తాండూర్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమాల్లో నాయకులు రాజమల్లు, బుచ్చన్న, ఇసాకర్, రాములు, చంద్రయ్య, విజయ్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, పోశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తాండూర్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

## దుమ్ములేస్తోంది..!

అటెన్షన్ ప్లీజ్..



**భీమారం:** మండలంలోని జోడువాగుల వద్ద జాతీయ రహదారిని వెడల్పు చేయకుండా అసంపూర్తి పనులు చేపట్టడంతో వాహనాల రాకపోకల సమయంలో విపరీతంగా దుమ్ములేస్తోంది. మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిలోని జోడువాగుల వద్ద సింగిల్‌రోడ్డుని రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులు మూడేళ్లు గడుస్తున్నా పూర్తిచేయడం లేదని ప్రజలు పేర్కొన్నారు. కంకర కారణంగా విపరీతంగా దుమ్ము లేస్తోందని, ద్విచక్రవాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని దుమ్ము లేవకుండా చర్యలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: అన్నయ్య, నేషనల్‌హైవేస్ డీఈఈ ఫోన్ నంబర్ : 73826 25560

# ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



దండేపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



చెన్నూర్ అంబేద్కర్ చౌరస్తాలో...



రామకృష్ణాపూర్‌లో...

**రామకృష్ణాపూర్:** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీజోన్ రాజీవ్‌చౌక్‌లో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, గోపతి బానేష్, రాజయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**దండేపల్లి:** రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ డిక్లరేషన్ గురించి పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సతీష్ వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దుర్గప్రసాద్, లక్ష్మీనారాయణగౌడ్, మల్లేష్, సత్తన్న, ప్రేంచంద్, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

**చెన్నూర్‌లో ఇరువర్గాలు వేరువేరుగా వర్ధంతి**

**చెన్నూర్:** పట్టణంలో కాంగ్రెస్ పార్టీలో బడా నాయకుల దగ్గర నుంచి చోట నాయకుల వరకు రెండు వర్గాలుగా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుల వర్ధంతులు, జయంతి ఉత్సవాలను సైతం వేరువేరుగా నిర్వహిస్తూ వర్గపోరును బహిర్గతం చేస్తున్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఆదివారం డీసీసీ అధ్యక్షురాలు సురేఖప్రేమ్‌సాగర్‌రావు వర్గం నాయకులు గాంధీచౌక్‌లో నిర్వహించగా, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వర్గం నాయకులు అంబేద్కర్ చౌరస్తాలో వర్ధంతి వేడుకలను నిర్వహించడం విశేషం. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తగరం వెంకటి, ఈర్ల నారాయణ, చెన్న సూర్యనారాయణ, బాపగౌడ్, ఖలీల్, చెన్నూరి శ్రీధర్, సుధాకర్‌రెడ్డి, రాజమల్లగౌడ్, మహేశ్‌ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లిరూరల్:** రాజీవ్‌గాంధీ వర్ధంతిని బెల్లంపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు తొంగల మల్లేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యక్షుడు హరీష్, సీనియర్ నాయకులు రొడ్డ శారద, నయీం, కౌన్సిలర్ గుజ్జ రవి, నాయకులు స్వామి, రాజలింగు, మల్లేష్, రోహిత్, ఆకాష్ పాల్గొన్నారు.

**లక్సెట్టిపేట:** రాజీవ్‌గాంధీ వర్ధంతిని మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐబీ ఆవరణలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు చింత అశోక్, ఆరీఫ్, రమేష్, సురేష్, హాజీ, నవాబ్, స్వామి పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** రాజీవ్‌గాంధీ వర్ధంతిని పాత బస్టాండ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టీ పీసీసీ సభ్యులు నూకల రమేష్ హాజరై రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముజాయిద్, నీలయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, శంకర్, జనార్దన్, నర్సోజీ, రాయలింగు, రాధ, స్రవంతి, మల్లీశ్వరి తదితరులు ఉన్నారు.



బెల్లంపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



లక్సెట్టిపేటలో...



మందమర్రిలో...

## నీటి కష్టాలు తీర్చండి..!

మండలంలోని కేతన్‌పల్లి గ్రామానికి చెందిన ప్రజలు మూడు నెలలుగా తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు, పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకువాడలో నీటి కష్టాలపై కాలనీవాసులు రోడ్డెక్కి నిరసన తెలపగా, గతంలో ప్రభుత్వాలు నీటి అవసరాలకు ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం పాయింట్ ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం భగీరథ వాటర్‌ట్యాంక్ నిర్మించారు. ప్రస్తుతం మూడు నెలలుగా తాగునీటికి 50కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఎడ్లబండ్లతో సమీప పొలాల నుంచి డ్రమ్ములతో, బోర్ల వద్ద నీళ్లు తెచ్చుకుంటున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

\- వేమనపల్లి

పొలాల బోరు వద్ద కాలనీవాసుల బారులు





## తీవ్ర ఎండా.. చెట్టే అండ..!



ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ఉష్ణోగ్రతల తీవ్రతను మనుషులే కాదు.. జంతువులు కూడా తట్టుకోవడం లేదు. మధ్యాహ్న సమయంలో పశువులు మేతను విడిచి, చెట్టు నీడను వెతుక్కుంటున్నాయి. దండేపల్లి మండలం చెల్కగూడెం సమీపంలో మిట్ట మధ్యాహ్నం రోడ్డుపక్కన ఓ చెట్టునీడన గొర్రెలు సేద తీరుతుండగా, సాక్షి క్లిక్‌మనిపించింది.

\- దండేపల్లి

## తునికాకు సేకరణ ప్రారంభం

- గ్రామీణ ప్రజలకు ఉపాధి
- ధర పెంచడంతో మొగ్గుచూపుతున్న జనం

**నెన్నెల:** ఏటా వేసవిలో పల్లె ప్రజలు, గిరిజనులు ప్రకృతి సంపదగా భావించే తునికాకు(బీడీ ఆకు) సేకరణ మండలంలో ప్రారంభమైంది. మండలంలోని కొత్తూర్, చిన్నవెంకటాపూర్, గంగారాం, చిత్తాపూర్, జెండావెంకటాపూర్, నార్వాయిపేట, మెట్‌పల్లి, గొల్లపల్లి, మైలారం, కుశ్నపల్లి గ్రామాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్న, పెద్ద అందరూ తెల్లవారుజామునే అడవిలో కలియ తిరుగుతూ ఆకు సేకరణ చేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు ఇళ్లకు చేరి ఊళ్లలో ఉన్న విద్యార్థులు సైతం ఆకు సేకరణకు వెళ్తున్నారు. నెల రోజుల పాటు గ్రామీణులకు చేతినిండా పని లభించనుంది. ఎండలు మండుతుండటంతో మసుక చీకట్లోనే అడవి బాట పట్టి ఆకులు సేకరించుకొని, ఎండకాక ముందే 8గంటలకు ఇంటి బాట పడుతున్నారు. ఇంటి పట్టున కుటుంబ సభ్యులంతా నీడన కూర్చొని సేకరించిన ఆకులను కట్టలుగా కడుతున్నారు. గతంలో ప్రభుత్వం 50ఆకుల కట్టకు రూ.2చెల్లించేది. ఈ యేడు రూ.3చెల్లించడంతో కూలీలు ఆకు సేకరణకు మొగ్గు చూపుతున్నారు. ఒక్కొక్క కుటుంబం ఈ సీజన్‌లో రూ.2వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. సేకరించిన ఆకుల కట్టలను సాయంత్రం సమీపంలోని కల్లాల వద్దకు తీసుకెళ్లి కాంట్రాక్టర్‌కు విక్రయిస్తున్నారు. ఆకుల కట్టలను కల్లాల్లో వారం రోజులు ఆరబెట్టిన తర్వాత వాటిని బస్తాల్లో నింపి సంబంధిత గోదాంకు తరలిస్తున్నారు.



గంగారంలో సేకరించిన ఆకులు కట్టలు కడుతున్న కూలీలు